క్లుప్తంగా

నేడు మండల సర్వసభ్య సమావేశం

సంతబొమ్మాళి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ప్రేమ లీల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

సుప్రీం తీర్పు భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకమైంది



నిరసన తెలియజేస్తున్న దళిత సంఘాల నాయకులు

ఇచ్ఛాపురం: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి వ్యతిరేకమైనదని ఇచ్ఛాపురం దళిత ఐక్య వేదిక అధ్యక్షుడు సల్లా దేవరాజు అన్నారు. ఎస్సీ, ఎస్టీల వర్గీకరణను వ్యతిరేకిస్తూ బుధవారం చేపట్టిన భారత్‌బంద్‌ను ఇచ్ఛాపురంలో కూడా చేపట్టారు. ఈ సందర్భంగా దళితసంఘం ఐక్యవేదిక గౌరవ అధ్యక్షుడు నగిరి మోహన్‌రావు మాట్లాడుతూ.. క్రిమీలేయర్ విధానం వల్ల షెడ్యూల్ కులాలు, తెగల కింద కులాల వర్గీకరణ ఏర్పడితే రోస్టర్ ప్రకారం సరైన ప్రాతినిధ్యం లభించదని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండ్ కూడలిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ కూడలి నుంచి దాసన్నపేట మీదుగా బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి నాగులురోడ్ల కూడలిలో మానవహారం చేశారు. దళిత సంఘ నాయకులు నూతలపాటి బాబూరావు, దువ్వాడ దిలీప్, కృష్ణంరాజు, పందిరి లోకేష్, జి.ప్రకాష్, దద్ద గిరీష్, చక్రధర్, గువ్వాడ ప్రదీప్, మద్దిలి కేశవ్‌రావు, రాజారావణ్, డి.వెంకటరావు, బి.ఈశ్వరరావు, బర్రు చంద్రశేఖరం పాల్గొన్నారు.

భవానీశంకర్‌కు ఘనంగా నివాళి



భవానీశంకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీకి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, సీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్ ఇటీవల మృతి చెందారు. అతని సంతాప సభను కాశీబుగ్గ పాతజాతీయ రహదారిలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం నిర్వహించారు. పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కుటుంబ సభ్యులు హాజరై భవానీ శంకర్‌సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ కోత రేపు

కాశీబుగ్గ: పలాసలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోఆర్‌కేపురం ఫీడర్‌లో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. దీంతో ఆ రోజు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ పలాస పురుషోత్తపురం, జి.జె.కాలేజీరోడ్డు, హడ్కోకాలనీ, రాజమ్మకాలనీ, మున్సిపల్ ఆఫీసులైన్, ఎమ్మార్వో ఆఫీసు, శాసనం, మొగలిపాడు, పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పలాస డివిజన్ విద్యుత్‌శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు బుధవారం తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



నిరసనలో ఇస్కలపాలెం గ్రామస్తులు

సోంపేట: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై హత్యాచారం జరిపిన దోషులను కఠినంగా శిక్షించి, బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని ఇస్కలపాలెం గ్రామ యువత, గ్రామస్తులు డిమాండ్ చేశా రు. వైద్యురాలిపై జరిగిన దారుణాన్ని నిరసిస్తూ గ్రామంలో గ్రామయువత ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని నినాదాలు చేశారు.

• వైద్య శిబిరం



పలాస మండలం మామిడిపల్లి గ్రామంలో బుధవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 54 మందికి రక్తపరీక్షలు చేసి ఉచితంగా మందులు సరఫరా చేశారు. మండలంలో విషజ్వరాలు ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు చేశారు. రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునిల్‌కుమార్, ఏఎస్‌ఎం ఆదిలక్ష్మి, ఎంఎల్.పీహెచ్ పావని, చిన్నారావు, ఆశవర్కర్లు పాల్గొన్నారు. –పలాస

• రచయిత్రికి సత్కారం



తెలుగు భాషా దినోత్సవ సంబరాల కవి సమ్మేళనంలో కవిటి మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన యువ కవియత్రి, రచయిత్రి సాహు సంధ్య ప్రతిభ కనబర్చరు. డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ‘శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో‘138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో సంధ్య తెలుగు భాష విశిష్టతను వచన రూపంలో కవితను ఆలపించారు. దీనికిగాను కళావేదిక వ్యవస్థాపక అధ్యక్షులు కత్తిమండ ప్రతాప్, సంస్థ సభ్యులు సంధ్యను సత్కరించారు. –కవిటి

• చైతన్యర్యాలీ



ఎయిడ్స్ వ్యాధిని నివారిద్దామని బాలబాలికలు నినాదాలు చేశారు. కవిటి మండలంలోని ఆర్.బెలగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నమితకుమారి సాహూ ఆధ్వర్యంలో బుధవారం ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన ర్యాలీని చేపట్టారు. వైసీబీ పీయూ ట్రక్కర్స్ సంస్థ ఆధ్వర్యంలో జరిగిన చైతన్య ర్యాలీలో మాధవరావు, రవికుమార్ పాల్గొన్నారు. –కవిటి

• బాధ్యతల స్వీకరణ



కాశీబుగ్గ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా దాడి మోహన రావు బుధవారం ఉదయం బాధ్యతలు చేపట్టారు. విజయనగరం జిల్లా రాజాం టౌన్ నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. 2006లో ట్రైనీ ఎస్‌ఐగా కాశీబుగ్గ పోలీసు స్టేషన్‌లో ఈయన పనిచేశారు. ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సీఐ కోరారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డిని సీఐ మోహనరావు మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలను అందజేశారు. –కాశీబుగ్గ, శ్రీకాకుళం క్రైమ్

నిబంధనలు బేఖాతర్!

- మినీ వాహనాల్లో అధిక లోడుతో రవాణా
- హైవేపై పొంచి ఉన్న ప్రమాదాలు



టెక్కలిలో రద్దీగా ఉండే రహదారిపై అధిక లోడుతో వెళ్తున్న మినీ వాహనం

టెక్కలి: జనాలు రద్దీగా ఉండే ప్రాంతాలు, జాతీయ రహదారిపై నిబంధనలను బేఖాతర్ చేస్తూ కొంత మంది వాహనదారులు అధిక బరువుతో రవాణాలు కొనసాగిస్తున్నారు. ఇలాంటి రవాణాతో రెప్పపాటు తప్పిదం జరిగితే భారీ ప్రమాదాలు జరిగే అవకాశాలున్నాయి. డివిజన్ కేంద్రమైన టెక్కలికి ఆనుకుని జాతీయ రహదారిపై, జనాలు రద్దీగా తిరిగే ప్రాంతాల్లో నిత్యం ఇలాంటి అధిక బరువు రవాణాలు కనిపిస్తుంటాయి. మినీ వాహనాల్లో పాత ఇనుప సామాన్లు, ఇతర సామగ్రిను తరలించే వాహనదారులు అధిక బరువుతో ప్రమాదంగా రవాణా కొనసాగిస్తున్నారు. వాస్తవంగా నిబంధనల మేరకు వాహనాలకు యాగ్జిల్ (టైర్లు) సంఖ్య ఆధారంగా బరువును నిర్దేశిస్తూ రవాణా చేయాలి. కాని ఆ నిబంధనలను ఎవరూ పట్టించుకోవడం లేదు. రవాణా విషయంలో పెద్ద లారీల విషయానికి వస్తే వాహనానికి ముందు ఒక యాగ్జిల్, వెనుక భాగంలో రెండు యాగ్జిల్ ఉంటే 35 టన్నుల వరకు రవాణా చేయాలి. వాహనానికి ముందు ఒక యాగ్జిల్ వెనుక భాగంలో మూడు యాగ్జిల్ ఉంటే 40 టన్నులు వరకు రవాణా చేయాలి. అదేవిధంగా ముందు భాగంలో రెండు యాగ్జిల్, వెనుక భాగంలో మూడు యాగ్జిల్ ఉంటే 49 టన్నుల వరకు రవాణా చేయాలి. కాని ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ భారీ బరువులతో రవాణా చేస్తున్నారు. చిన్న వాహనాల విషయానికి వస్తే కనీస నిబంధనలు లేకుండా అధిక బరువుతో రవాణా చేస్తున్నారు. ఇలాంటి భారీ బరువుతో రవాణా కొనసాగిస్తూ ప్రమాదాలకు సంకేతాలుగా ఉన్న వాహనాలపై కళ్లెం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారిస్తాం

నిబంధనలకు విరుద్ధంగా మినీ వాహనాల్లో అధిక లోడులపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తున్నాం. అధిక లోడుతో రవాణా చేస్తున్నట్లు తెలిస్తే తక్షణమే చర్యలు తీసుకుంటాం.
–డి.సంజీవరావు, ఎంవీఐ, టెక్కలి

విమర్శలు వద్దు–అభివృద్ధి చేయండి

- మందస ఎంపీపీ దానయ్య



ఓపెన్ విద్య పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శిరీష, ఎంపీపీ దానయ్య తదితరులు

కాశీబుగ్గ: గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానేసి అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని మందస ఎంపీపీ డొక్కరి దానయ్య విజ్ఞప్తి చేశారు. మందస మండల కార్యాలయంలో ఎంపీపీ దానయ్య అధ్యక్షత మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వం, గత నాయకుల పేర్లతో విమర్శలు చేయడంతో ఎంపీపీ దానయ్య అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సమస్యలను ప్రస్తావించారు. దీనికి ఎమ్మెల్యే కలుగజేసుకుని గత ప్రభుత్వం, గత మంత్రి చేతకాని వారని, ఏమీ అభివృద్ధి చేయలేదని, ఇరిగేషన్‌ను పట్టించుకోకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురయ్యారన్నారు. దీనికి ఎంపీపీ దానయ్య కలుగజేసుకుని ఒక్కో ప్రభుత్వం వేర్వేరు పథకాలతో ప్రజల్లోకి వెళ్తుందన్నారు. సాగునీరు అందించడంలో గత ప్రభుత్వం వెనుకంజ వేసిందని ఒప్పుకుంటున్నామని అన్నారు. గత ప్రభుత్వం హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, రూ.700 కోట్లుతో ఉద్దాన వాటర్ ప్రాజెక్టు వంటి పథకాలను ప్రజలు మరిచిపోలేదన్నారు. విమర్శలను పక్కనపెట్టి అభివృద్ధి చేయాలని.. అందుకు తామంతా మద్దతుగా ఉంటామని అన్నారు. అనంతరం పలువురు సభ్యులు మాట్లాడుతూ.. హరిపురం, సిరిపురం తదితర గ్రామాల్లో డీఏపీ, యూరియా వంటి ఎరువులు ఇవ్వకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఉద్దానం ప్రాంతంలోని 45 గ్రామాలకు ఇంటింటికీ కుళాయిల ద్వారా నీరు అందలేదని.. అధికారులు స్పందించాలని కోరారు. తంగారిపుట్టుగలో 30 మంది విద్యార్థులకు ఒకే ఉపాధ్యాయుడు ఉండడంతో చదువులు సాగడం లేదని స్థానిక ప్రజాప్రతినిధి అన్నారు. మందసలో ప్రభుత్వ వైద్యశాలలకు మత్తు వైద్యులు, ప్రసూతి వైద్య నిపుణులు, వాచ్‌మేన్‌లు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అనేక గ్రామాలకు సాగునీరు అందడం లేదని చర్యలు చేపట్టాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే శిరీష స్పందిస్తూ.. మందస మండలానికి వంశధార నీటిని తీసుకువస్తామని చెప్పారు. కళింగదళ్, డబారుసింగ్, దామోదరసాగర్లకు సుమారు రూ. ఐదు కోట్లతో మరమ్మతులు చేసి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. పంచాయతీల వారీగా ఈనెల 23వ తేదీ నుంచి గ్రామ సభలు నిర్వహిస్తారని.. స్థానికులు గ్రామాల్లో ఉన్న సమస్యలను సభ దృష్టికి తీసుకొస్తే ప్రణాళికా బద్ధంగా పరిష్కారం చేస్తామన్నారు. ఈ సందర్భంగా టెన్త్, ఇంటర్ ఓపెన్ విద్యకు సంబంధించిన పోస్టర్‌ను ఎమ్మెల్యే శిరీష, ఎంపీపీ దానయ్య, అధికారులు ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ శిరపు ప్రసాద్, ఎంపీడీవో తిరుమలరావు, డి.టి.రవికుమార్ ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: సీజనల్ వ్యాధులపై శానిటేషన్ సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అన్నారు. హెల్త్, శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలతో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం నమోదవుతున్న జ్వరాలపై ఆరాతీశారు. కాలువల్లో మురుగు నీరునిల్వ ఉండకుండా రోజూ శుభ్రం చేయాలని సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రదేశంలో దోమలు ప్రబలకుండా నివారణ మందులను పిచికారీ చేయాలని, ఆయిల్‌బాల్స్‌ని వేయాలని, కాలువల్లో పేరుకుపోయిన పూడికను తొలగించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, వార్డ్ హెల్త్‌సెక్రటరీలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

కాశీబుగ్గ: పలాసకు చెందిన సింహాద్రి సురేష్ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. ఇతని కుటుంబానికి పలాస నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ వేదిక అండగా నిలిచింది. రూ. 35 వేలు సేకరించారు. ఈ మొత్తాన్ని సురేష్ కుటుంబ సభ్యులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో వేదిక కార్యవర్గ సభ్యులు కొత్తపల్లి చిన్నాచారి, వజ్రాల విష్ణు, షణ్ముఖరావు, పొన్నూరు కన్నా, అండలూరి కోటి, లక్కోజి శ్రీను ఉన్నారు.

వినాయక చవితికి శుభరాట

కంచిలి: మండల కేంద్రం కంచిలి మెయిన్‌రోడ్డులో ఎస్‌బీఐ కూడలి వద్ద ఏర్పాటు చేయనున్న వినాయక నవరాత్రి ఉత్సవాలకు శుభరాటను బుధవారం వేశారు. ఏటా ఇక్కడ భారీ వినాయకుని విగ్రహం ఏర్పాటుచేసి ఉత్సవా లు నిర్వహిస్తుంటారు. ఈ ఏడాది కూడా విజ యవంతంగా ఉత్సవాలు చేపట్టడానికి శుభరా ట వేసినట్లు పూజా కమిటీ సభ్యులు తెలిపారు.

14న లోక్ అదాలత్

కోటబొమ్మాళి: సెప్టెంబర్ 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు వినియోగించుకోవాలని కోటబొమ్మాళి కోర్టు జూనియర్ సివిల్‌జడ్జి బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. అదాలత్ నిర్వహణపై పోలీసులు, న్యాయవాదులతో బుధవారం ముందస్తు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అదాలత్‌లో ఎక్కువకేసులు రాజీ అయ్యేవిధంగా కృషి చేయాలని బార్ అసోసియేషన్ ప్రతినిధులను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు లఖినేని శ్రీనివాసులు, ఏజీపీ ఎస్.తిరుపతి, న్యాయవాదులు ఉప్పాడ తిరుమలరావు, కె.అచ్చెన్నాయుడు, పల్లి వాసుదేవరావు, వాన నేతాజీరావు, వి.అప్పలనాయుడు, పి.అర్జునరావు, ధర్మారావు ఉన్నారు.

ఇష్టమైన రంగాన్ని ఎంచుకోవాలి

టెక్కలి: భవిష్యత్‌లో ఉద్యోగం చేయాలా.. వ్యాపారంలో స్థిరపడాలో నిర్ణయాన్ని మీరే తీసుకోవాలని ఐటీ సొల్యూషన్ విభాగానికి చెందిన డాక్టర్ బి.మల్లేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి అన్నారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాజ్ ఏ కెరియర్ అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. కొన్ని రాష్ట్రాల్లో తమ పిల్లలు వ్యాపార రంగంలో స్థిర పడే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహిస్తారని, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం భిన్నంగా ఉంటుందని అన్నారు. ధైర్యం, పట్టుదల ఉంటే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల పెన్సిల్ ముల్లుపై 26 అక్షరాలను 17 నిమిషాల్లో రాసి బుక్ ఆఫ్ ఇండియాలో స్థానం సాధించిన కళాశాల ఈసీఈ విద్యార్థిని వర్షప్రియకు రూ.10 వేలు ప్రోత్సాహక బహుమతి అందజేశారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, డీన్ జి.సతీష్‌కుమార్, ఈసీఈ హెచ్‌ఓడీ వి.అశోక్‌కుమార్, అధ్యాపకులు రఘువీర్, సురేష్, గిరీష్ ఉన్నారు.

23న ఉపాధి గ్రామసభలు

కంచిలి: మండలంలోని 31 పంచాయతీల పరిధిలో ఈ నెల 23వ తేదీన ఉపాధిహామీ పథకం పనుల గుర్తింపునకు గ్రామసభలు నిర్వహించాలని ఎంపీడీవో వి.నీరజ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి అవసరమైన పనులను గ్రామ పంచాయతీల పరిధిలో సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుడు, మిగతా ప్రజాప్రతినిధులు, వేతనదారులు కలిసి ఒకచోట సమావేశమై గుర్తించాలని అన్నారు. దీనిపై అన్ని పంచాయతీలకు సమాచారం ఇచ్చామన్నారు.

అతిథి అధ్యాపకుల పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

సంతబొమ్మాళి: నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరానికి గెస్ట్ (అతిథి) అధ్యాపకులుగా పని చేయడానికి ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓ.ఏ.ఎస్ (ఆఫీస్ అసిస్టెంట్ షిప్) వృత్తి విద్యా కోర్సులో టైప్, షార్ట్ హ్యాండ్ సబ్జెక్టులో ఖాళీ ఉన్నాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో తత్సమాన సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులకు తక్కువ కాకుండా ఉండాలన్నారు. ఈనెల 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు కళాశాల కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలన్నారు. విశ్రాంత ఆచార్యులు, అధ్యాపకులు, జూనియర్ అధ్యాపకులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు.

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో ఖాళీగా ఉన్న ఒకేషనల్ అడ్మినిస్ట్రేషన్ గ్రూపులోని కామర్స్–1 గెస్టు లెక్చరర్ ఉద్యోగానికి ఈ నెల 23వతేదీలోగా అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టి.సంతోషి తెలిపారు.

సోంపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ అధ్యాపకుని పోస్టుకు ఈ నెల 23వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఎ.మోహనరావు తెలిపారు. ఒకేషనల్ కోర్సు సబ్జెక్టు పోస్టు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

కాశీబుగ్గ: పట్టణంలోని విద్యావాహిణి జూనియర్ కళాశాలలో ఫ్రేషర్స్ డేను బుధవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ వైద్యురాలు హెచ్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో విలువలతో కూడిన విద్య నేర్చుకోవడం చాలా అవసరమన్నారు. విద్యార్థులు తమ లక్ష్య సాధనకు కృషి చేయాలన్నారు. గత ఏడాది ఇంటర్ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కళాశాల కరస్పాండెంట్ ప్రిన్సిపాల్ పైల తిరుమలరావు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎ.గిరిబాబు, ఉపాధ్యాయులు బి.కోదండరావు, దుర్యోధనరావు పాల్గొన్నారు.

శివారు భూములకు సాగునీరివ్వాలి



మాట్లాడుతున్న గోవిందరావు

టెక్కలి: వంశధార కాలువలకు షట్టర్లు బిగించి శివారు భూములకు సాగు నీరు అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. బుధవారం టెక్కలిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు షట్టరు బిగించకపోవడంతో శివారు భూములకు సాగు నీరు అందకపోగా, మరో వైపు వందల టన్నుల కొలది షట్టర్లు గోదాంలలో మూలుగుతున్నాయని గుర్తు చేశారు. సాగు నీరు అందజేయాల్సిన కాలువల్లో షట్టర్లు లేకపోవడం, మదుములు సరిగ్గా లేకపోవడంతో పూర్తి స్థాయిలో సాగు నీరు అందడం లేదన్నారు. దీనిపై ప్రభుత్వం కనీసం దృష్టి సారించడం లేదని మండిపడ్డారు. అలాగే పూర్తి స్థాయిలో ఎత్తిపోతల పథకాలు పనిచేసే విధంగా అధికారులు చిత్తశుద్ధిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎస్.షణ్ముఖరావు, ప్రతినిధులు పి.సాంబమూర్తి, కె.ఎల్లయ్య, యు.లక్ష్మణరావు, హెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రాత్రి గస్తీ ముమ్మరం చేయాలి



నౌపడ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

సంతబొమ్మాళి: రాత్రి వేళల్లో గస్తీ ముమ్మరం చేయాలని, అనుమానిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. నౌపడ, భావనపాడు మైరెన్ పోలీస్ స్టేషన్లను బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, రిజిస్టార్‌లను పరిశీలించారు. పోలీసు సిబ్బందికి పలు సలహాలు, సూచనలు చేశారు. కాలేజీ రోడ్డులో పోలీసు భద్రత ఏర్పాటు చేయాలని, ఈవిటీజింగ్‌కు పాల్పడే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తీర ప్రాంత గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల కదలికపై మరింత అప్రమత్తంగా ఉండి నేరాల నియంత్రణకు ప్రత్యేక చొరవ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది ఇబ్బందులను అడిగి తెలుసుకొని పరిష్కారానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. నౌపడ ఎస్ఐ కిషోర్ వర్మ ఉన్నారు.

ఇచ్ఛాపురం సీఐగా చిన్నంనాయుడు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా మీసాల చిన్నంనాయుడు బుధవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ డివిజన్‌లో ఏసీబీలో సీఐగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. నూతన సీఐకి ఇచ్ఛాపురం సర్కిల్ పరిధిలోని ఎస్‌ఐలు వి.సత్యన్నారాయణ, ఎస్.లక్ష్మణరావు, రాము ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు.